క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రేపల్లె రూరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ నిధులతో మండలంలోని నల్లూరుసాత్ ఎస్సీ కాలనీలో నిర్మించిన అయోధ్య రామాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు బృందం సీతారాముల కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, సీతారాములకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ డొక్కు మాధవి, పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, పేరం కోటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, గూడవల్లి కుటుంబరావు, లంకా కృష్ణ కుమారి, పోలిమెట్ల సుందరరావు, రామారావు, చిట్టిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి ప్రధాన పీఠాన్ని ఏర్పాటు చేసి అయ్యప్ప, శివ, భవాని దీక్ష దారులకు ప్రతి నిత్యం సద్ది ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి దీక్షదారులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. 32వ రోజు మోటూరు యుగంధర్, మద్దిబోయిన శివశంకర్‌లు సద్ది ఏర్పాట్లు చేశారు.

విఠలేశ్వరుడికి లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు: భట్టిప్రోలులో దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగాపార్వతి సమేత విఠలేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం 37వ కార్తిక వన సమారాధన, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. వేదబ్రాహ్మణుల ఆధ్వర్యంలో స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన జరిపారు. సాయంత్రం గో పూజ నిర్వహించారు. రాత్రి నిర్వహించిన కార్తిక వన సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వనసమారాధన ఆహ్వాన కమిటీ నిర్వాహకులు ఆదిన వెంకట సుబ్బారావు, మేడూరి వీరయ్య, వంగర నాగేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

కలెక్టర్ వెంకట మురళి

చెరుకుపల్లి: విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. మండలంలోని చెరుకుపల్లి, గుళ్లపల్లి, కావూరు జిల్లా పరిషత్ హైస్కూళ్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక సదుపాలు, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని తెలిపారు. పేద, మధ్య తరగతుల విద్యార్థులే అధికంగా ప్రభుత్వ పాఠశాలలకు వస్తుంటారని, వీరికి పథకాలు నూరు శాతం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉన్నత విలువలతో కూడిన విద్యను అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్.పద్మావతి, ఎంఈవో నవీన్‌కుమార్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థితో బోర్డుపై పదాలు రాయిస్తున్న కలెక్టర్

పాఠశాలల నిర్వహణ సక్రమంగా ఉండాలి

బాపట్ల టౌన్: పాఠశాలల నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం హాజరైన వారి సంఖ్య, ఆట స్థల పరిశీలన, విస్తీర్ణం, కొత్తగా నిర్మాణం చేపట్టిన భవన వివరాలపై ఆరా తీశారు. నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి గుత్తేదారుడికి ఆదేశాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన మెనూను పక్కాగా అమలు చేయాలని, నాణ్యత లోపిస్తే సహించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

బాపట్ల టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ జి. కరుణ సాగర్ తెలిపారు. వ్యవసాయ కళాశాలలో ఈనెల 17 నుంచి 20 వరకు జరిగిన రెండో దశ ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ అంతర కళాశాలల క్రీడల పోటీల ముగింపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కరుణ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో ఎంత శ్రద్ధగా గడుపుతారో క్రీడా మైదానాల్లోనూ అదే మాదిరిగా వ్యవహరించాలని తెలిపారు. ఐటీసీ సీనియర్ మేనేజర్ వి.వి.ఆర్. దీక్షిత్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహపూర్వక వాతావరణం లభిస్తుందని తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ హెడ్ ఆర్.రవికాంత్‌రెడ్డి విద్యార్థుల క్రమశిక్షణ వల్లే పోటీలను సమర్థంగా నిర్వహించగలిగామని తెలిపారు. సభకు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి. ప్రసూనారాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డి.డి.స్మిత్, కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అసోసియేట్ డీన్ ఎం.సర్దార్ బేగ్, జి.వినయ్ కుమార్, డి.వి. సాయిరాం కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. సాంస్కృతిక విభాగం, గేమ్స్‌లో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. విద్యార్థులను యూనివర్సిటీ, అధికారులు, కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న కరుణ సాగర్

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

– జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ పి.పద్మ



బాపట్లటౌన్: తాగునీరు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ పి.పద్మ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై బుధవారం జిల్లాలోని ఏరియా కో ఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ పి.పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు కచ్చితంగా చేతులను శుభ్రంగా ఉంచుకుంటూ అనారోగ్యం పాలు కాకుండా ఉండాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కాచి చల్లార్చిన నీరు తాగటం వల్ల వ్యాధులు సంక్రమించకుండా ఉండొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణులు, బాలింతలు రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ యాంకర్ పర్సన్ డి.శ్రీనివాసులు, మాస్టర్ ట్రైనర్స్ మస్తాన్, శ్రీనివాసరెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు దగ్ధం

పెరవలి(వేమూరు): విద్యుత్ మోటార్ల పాకకు అగ్ని ప్రమాదం జరగడంతో రెండు విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్ పూర్తిగా దగ్ధమయ్యాయని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో దండే శ్రీనివాసరరావు పొలంలో తాటాకుల పాకలో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగిందిని ఫిర్యాదు చేశారు. అగ్ని ప్రమాదం గుర్తు తెలియన వ్యక్తులు చేశారని చెప్పారు. సంఘటన ప్రాంతానికి వెళ్లి అగ్ని ప్రమాదం పరిశీలించడం జరిగిందని ఆయన అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



పెనుమూడి రేవులో అక్రమంగా ఇసుక తవ్వకాలు

- అక్రమార్జనకు తెగబడుతున్న కూటమి నేతలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గం పెనుమూడి రేవులో యథేచ్ఛగా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రేవులో ఇసుక రీచ్‌కు అనుమతులు లేకపోయినా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలతో ఆయన అనుచరులు అక్రమార్జనకు తెరలేపారు. లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ ఆదేశాలను బేఖాతారు చేస్తూ నేతలు అక్రమార్జనకు తెగబడుతున్నారు. పట్టపగలే యథేచ్ఛగా రేవు లోపల నుంచి పడవల ద్వారా ఇసుకును తీసుకొచ్చి ట్రాక్టర్‌లలో లోడ్ చేసి అమ్ముకుంటున్నా రెవెన్యూ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తైనా చూడకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. గత వారం రోజుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లను లోడ్ చేసి పట్టణ, పరిసర ప్రాంతాలలో విక్రయాలు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావు వివరణ

పెనుమూడి ఇసుక రీచ్‌కు ఎటువంటి అనుమతులు లేవు. ఈ రీచ్‌లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగటం లేదు. రేవు వద్ద తమ సిబ్బందితో పాటు పోలీసులను పహారాగా ఉంచాం. ఇసుక తవ్వుతున్నట్లు ఎవరైనా గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుంది.



పెనుమూడి కృష్ణానదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్న దృశ్యం

ట్రాక్టర్‌కు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు

రేవు వద్ద ట్రాక్టర్‌లలో లోడ్ చేసినందుకు రూ.1500 నగదు, రేవు వద్ద నుంచి రేపల్లె పట్టణానికి చేరవేస్తే రూ.2,500 నుంచి రూ.3,000 వరకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తే దూరాన్ని బట్టి మరింత నగదును వసూలు చేస్తున్నట్లు ప్రజలు, ప్రజా సంఘాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పక్క ఉచిత ఇసుక విధానం అంటూనే పెనుమూడి రీచ్‌లో ప్రస్తుతం అనుమతులు లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకుంటుండటంపై ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మణిలాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావుకు, చైర్మన్ కట్టా మంగలకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ విభాగాలైన వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఫిట్టర్, మెకానిక్, డ్రైవర్, టర్న్ కాక్, ఫంచరింగ్, వెల్డర్, పెయింటర్, గార్డినర్, కంప్యూటర్ ఆపరేటర్, వెటర్నరీ,సెక్యూరిటీ గార్డ్స్, వాచ్ మెన్‌లకు చెందిన విభాగాలలో సుమారు 13 వేలమంది కార్మికులు 20 నుంచి 25 ఏళ్లుగా ప్రజలకు ప్రభుత్వం తరఫున సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరికి 2018 వరకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు సమానంగా జీతాలుచెల్లించారని, ప్రస్తుతం తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై నెట్టివేసే ధోరణి మారాలన్నారు. ప్రమాదంలో మృతులకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల ఎక్స్ గ్రేషియోపెంపుదల చేసి, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం రూ.20 వేలు అందించాలని కోరారు. 17 రోజుల సమ్మె కాలం జీతం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రేపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎస్.రవిబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు, రమేష్, శ్రీనివాస్, యువరాజ్ పాల్గొన్నారు.



కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

26న మహా ధర్నా

భట్టిప్రోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కులకు, పౌరుల స్వేచ్ఛ స్వతంత్రాలకు, లౌకిక తత్వానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్‌లు ఆరోపించారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న మహా ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు జి.బాలాజి, ఎం.సత్యనారాయణ, కె.రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో పొలం పిలుస్తోంది



అమర్తలూరు(వేమూరు): రైతులు హార్వెస్టింగ్ చేసిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 17 శాతం ఉన్నట్లయితే రైతు సేవా కేంద్రం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.1,740కు కొనుగోలు చేయడం జరుగుతుందని ఏవో ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలం పెదపూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో పంట బీమా చేసుకోవాలని సూచించారు. సచివాలయంలో రైతులు పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు నకళ్లతో బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. జొన్న, మొక్కజొన్నలో ఎరువుల వినియోగం సస్యరక్షణ గురించి వివరించారు. విస్తరణాధికారి టి.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.పృథ్వీరాజ్, ఎ.క్షమణి పూజ్య, రైతులు పాల్గొన్నారు.

24న జాతీయ ప్రతిభా అన్వేషణ నమూనా పరీక్ష విడుదల

భట్టిప్రోలు: విజయనగరంలో ఈ నెల 24న ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా అన్వేషణ నమూనా పరీక్ష విడుదల జరుగుతుందని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ బుధవారం తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులచే ప్రశ్నాపత్రం, కీని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బాపట్లటౌన్ : పుస్తకాలు చదవడం వలనే ప్రపంచంలోని విశేషాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా చిన్నతనం నుంచి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని, నేటి యువత స్మార్ట్ ఫోన్‌లకు బానిసలుగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.శివాజీగణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

విద్యతోనే ఉన్నత శిఖరాలు

చుండూరు(వేమూరు): విద్య ఉన్నత శిఖరాలను అందిస్తుందని విద్యార్థులు చదువుకొని ఆ శిఖరాలు అందుకోవాలని ఎంఈవో సాల్మన్ అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో విజేతలకు ఆయన బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరస్వతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎం.సుధారాణి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): విద్యార్థులకు అక్షరాస్యతకు ఎంతో విలువ ఉందని ఎంపీపీ రావర్ల నరేంద్ర అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, ఎంపీడీవో బి.మారుతిశేషమాంబ, హెచ్‌ఎం కె.నిరీక్షణరావు, విశ్రాంత హెచ్‌ఎం మదన మోహనరావు, గ్రంథాలయాధికారి పి.శ్రీదేవి పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలని జెడ్పీటీసీ దాట్ల సౌజన్య అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆమె విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఏసు, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, గ్రంథాలయాధికారి శివకుమార్, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చుండూరు శాఖా గ్రంథాలయంలో..

వేమూరు: విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ అన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బుధవారం బహుమతులు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ ప్రకాశ్, మెడికల్ పబ్లిక్ హెల్త్ ఎడ్యుకేషన్ పున్నారావు, వెంకటరామయ్య, పంచాయతీ శానిటేషన్ అధికారి వేమూరి చంద్రపాల్, దివ్యాంగుల హెల్పర్ సొసైటీ వ్యవస్థాపకులు దాసరి బసవయ్య, చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ కొండ కీర్తన, గ్రంథాలయాధికారి కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

రేపల్లె రూరల్: విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కట్టా స్వాతీకుమార్, సిబ్బంది బసవలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కిషోర్

నల్లూరుపాలెంలో...

మండలంలోని నల్లూరుపాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నల్లూరు స్వర్ణలత గ్రంథాలయాలను ఉపయోగించుకునే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాం ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకుడు శివకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేవే గ్రంథాలయాలు

భట్టిప్రోలు: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయని భట్టిప్రోలు ఎంఈవో నీలం దేవరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈవో దేవరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే కేంద్రాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం కె.హవీలా ప్రశాంతి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చదవడం మాకిష్టం, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పించారు. పోటీలలో గెలుపొందిన 27 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ పర్యవేక్షించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సంపదనిచ్చే స్నేహితులు

నగరం: గ్రంథాలయాలు ప్రతి ఒక్కరికి విజ్ఞాన సంపదను అందించే స్నేహితులని సర్పంచ్ ఎం.ప్రమీల అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నగరం మండలం మంత్రిపాలెం గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వారోత్సవాలలో నిర్వహించిన పలు ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎం.శివరామకృష్ణ మాజీ సర్పంచ్ ఆర్.విజయలక్ష్మి, గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బహుమతులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సౌజన్య